# గురి తప్పని శరాలు

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

అడ్వొకేట్ ముకుందరావుగారు పొడుం మరోపట్టు మెదడుకిపంపించి మళ్లా ఆలోచనలో పడ్డారు. ఆయన దృష్టంతా ఎదురుగా కాగితాలమీద ఉన్నా, ఆలోచనలన్నీ జరిగిన విషయాలమీద ఉన్నాయని, మధ్యమధ్య ఆయన ఆకాశం కేసి ప్రతిఫలింప చేస్తోన్న చూపులు తెలియచేస్తున్నాయి. చదువుతూన్న పుస్తకాన్ని పక్కకినెట్టి, సరదాగా చూస్తూ ఎదుటి గదిలో సిగరెట్ వెలిగించాను.

అలాగ రెండు నిముషాలు గడచిపోయాయి.

"నేను పట్టిన కేసు పోవడానికి వీల్లేదు" అన్నారు ముకుందరావుగారు ఎదురుగా కూర్చున్న ముత్యాలరావుతో. ముత్యాలరావు ఈ కేసులో ఇరుక్కున్నవాళ్లని కోర్టుకి చేరవేసి, యథాశక్తి వాళ్ళ బరువులని తగ్గిస్తున్న పల్లెటూరి పంతులు. ఎదురుగా ముద్దాయి కూర్చుని వున్నా, ముకుందరావుగారు ఈ మాటలు ముత్యాలరావుతో అన్నారు.

"నాకు తెలియదుటండీ?" అన్నాడు మధ్యవర్తి. "తమరు కేసుపట్టారు అంటే వాళ్లు విశాఖపట్నంనుంచి తెచ్చుకున్నారు ప్లీడర్ని. అందుకే నేను అప్పారావుకి కూడా ఈ కేసు గెలవక తప్పదనే విషయం చెప్పేశాను."

ఒక దోపిడీ కేసులో ముద్దాయీ, ముకుందరావుగారి క్లయింటూ అయిన అప్పారావు ఇంక ఊరుకుంటే బాగుండదని, "తమ పేరు చెప్తే ఆ మూడు తాలూకాలూ హడల్ అండి" అన్నాడు. నూటికి పది కేసులే గెలుస్తున్నా, బస్సుస్టాండులో దిగిన చుట్టం ఆయన ఇంటిని వెదుక్కోవడానికి అధమం గంట తాపత్రయ పడవలసి ఉన్నా, బంధించిన ఒక పరమసత్యాన్ని బయటపెట్టినప్పుడు లాగ చూశారు ముకుందరావుగారు.

"మీ ఊరు మునసబు... అతనూ అలాగే అంటాడులే. అయినా ఏదో చిన్నవాళ్ళం. ఇలాగ బ్రతకనిస్తే..."

ముకుందరావుగారు అలంకారాలు వేసి సంభాషిస్తున్నారు. ఆ జీవులిద్దరూ యథాశక్తి ఆయనమాట కాదని, ఆ యువకి ఆ పల్లెపట్టుల నున్న గొప్పతనం అనేకోదాహరణలతో నిరూపించి, తిరిగి తమ కేసు విషయం ఆయనచేత ఎత్తించేసరికి వాళ్ళ పితామహులు దిగిఉంటారు. నా సిగరెట్టు కూడా అయిపోయింది.

"ఇప్పుడు ఓ ప్రమాదం వచ్చిపడింది" అన్నారు ముకుందరావుగారు, "కేసు మొత్తం అంతా పాడయ్యే ఒకమాట మన మూడో సాక్షి చెప్పేశాడు."

అక్కడ ఆగి, ముకుందరావుగారు నశ్యాన్ని మరోసారి నసాళాని కెక్కించారు. వాళ్లిద్దరూ తెల్లబోయి చూస్తున్నారు. మూడో సాక్షి ఏమిటి చెప్పేశాడో వాళ్ళకి తెలీదు.

"ముద్దాయి దోపిడి జరగడానికి మూడు రోజుల క్రితమే ముసలయ్య ఇల్లు కొనడానికి బేరం ఆడాడనీ, ఆ సందర్భంలో త్వరలో కొంత డబ్బు చేతికి వస్తుందని అన్నాడనీ, సదరు సాక్షి చెప్పేడు. కాని, విషయం చూస్తే, ఈమధ్య అప్పారావుకి అందవలసిన మొత్తం అంటే ఇల్లు కొనడానికి ఉపకరించేంత పెద్ద మొత్తం అతనికందవలసినట్లు సాక్ష్యం లేదు."

అసలు ముకుందరావుగారి ప్రత్యేకత ఇలాటి మాటల ఉచ్చారణలోనే ఉట్టిపడుతూంటుంది. ఆ కోర్టుపక్షులకి తమ డబ్బుకి సరియైన ప్రతిఫలం ముడుతూన్నట్లనిపించింది మాటలు వింటూంటే. వాళ్లేమీ మాటలాడకుండా ఊరుకున్నారు.

ప్లీడర్‌గారు పూర్తిచేశారు. "అందుచేత,

సదరు దోపిడీ ఉద్దేశ్యం ముద్దాయికి ముందే ఉందని, వాడి తరఫున వాదించడానికి అవకాశం ఉంది.''

మళ్ళా కొంచెం సేపు నిశ్శబ్దంగా గడిచిపోయేక, ముత్యాలరావు "అయితే ఏమిటి చేయాలండి ఇప్పుడు?" అని అడిగాడు.

"నేను పట్టిన కేసు పోవడానికి వీల్లేదు" అన్నారు ముకుందరావుగారు దృఢంగా.

ఔను.

"ఈ కేసులో సాక్షి వాచాలత్వం వలన చాలా ప్రమాదం జరుగబోతోంది.''

ఔను.

"కేసు బుజువైతే మూడు సంవత్సరాలకు తక్కువ శిక్ష పడదు.''

అప్పారావు తృళ్ళి పడ్డాడు.

"అందుచేత దీనికి ఉపాయం ఆలోచించాలి" అంతా ఏకీభవించారు.

"ఏం చెయ్యమంటారో తమరే ఆలోచించండి" అన్నాడు ముత్యాలరావు.

"తమరెలా చెప్తే అలా చేస్తాం" అన్నాడు అప్పారావు.

ముకుందరావుగారు గాంభీర్యం వహించారు. శేషు పట్టుకువచ్చి టేబిల్ మీద పెట్టిన కాఫీ కూడా ఆయన గుర్తించలేదు. ఆలోచనా తరంగాలాయన ముఖంలో ప్రస్ఫుటమాతున్నాయ్. నిమిషాలు నిశ్శబ్దంగా గడుస్తున్నాయి. ఆయన పచారుచేస్తున్నారు అవనతవదనంతో. ఆకాశంలోంచి దిగే అప్సరసకోసంలాగ మూడేళ్ల జైలు జీవితాన్ని తలచుకుని వణకుతూన్న అప్పారావు ఆయన కేసి ఆశతో ఎదురు చూస్తున్నాడు.

ఇంతలో హటాత్తుగా ముకుందరావుగారి ముఖాన కాంతిరేఖలు కనిపించి మిగిలినవాళ్ళ ముఖాలలో ప్రతిఫలించాయి. ఆయన కాఫీని ఒక్కగుక్కలో మింగేసి, పాము పట్టు లోపలికి పంపి కుర్చీలో కూర్చున్నారు.

"సామ, దాన, భేద, దండోపాయాలు అన్నారు పెద్దలు" అంతా ఒప్పుకున్నారు.

"వచ్చే నష్టాన్ని వీలైనంత తగ్గించుకోవడం బుద్ధిమంతుల లక్షణం.''

అక్కడ అంతా బుద్ధిమంతులే.

"మనం ఇప్పుడు మురళీగారిని పట్టుకోవాలి. ఆయనద్వారా మేజిస్ట్రేటుగారికి ఓ అయిదువందలు ముట్టజెప్పి, శిక్ష ఒకటి రెండు మాసాలు పడేలాగ చూసుకోవాలి.''

నిశ్శబ్దం.

"ఇంతకుమించి హరిహరాదులు వచ్చినా ఏమీ చెయ్యలేరు.''

హరిహరాదులు కనిపించిన అప్పారావు ముత్యాలరావు కేసి చూశాడు.

"తమ ఉద్దేశ ప్రకారం కానివ్వండి" అన్నారు. అయిదువందలూ తక్షణం తెచ్చి ఇవ్వడానికి ఒప్పుకుని వాళ్లు వెళ్ళిపోయారు.

కథ ఇంతదాకా జరిగేదాకా నేను కంటి సాక్ష్యమే. తరువాత జరిగిన సంగతంతా శేషు ద్వారా తెలుసుకున్నాను. ఈ మురళిగారు మేజిస్ట్రేటుగారి గుమాస్తా. ఇచ్చిపుచ్చుకోవడాల్లోనూ, ఇతర రహస్య వ్యవహారాల్లోనూ ఆయనకి రాడార్ లాంటివాడు. కాని, నాలుగు నెలల క్రితం ఆయనకీ, ముకుందరావుగారికీ బెడిసింది. అంటే, ఒక కేసులో ముకుందరావుగారు ఓడిపోవడానికి అతను కారణం అయ్యాడు. అంచేత, ముకుందరావుగారికి అంచాలన్నా, మురళీ అన్నా అసహ్యం పుట్టి పెరిగింది. అయితే, ఈ సంగతి మురళికి తెలియదు. ఎంచేతనంటే, మురళి వాస్తవంగా ఆ కేసులో ఏమీ దగా చెయ్యక పోవడమే కాక, అతనికి ముసలి ముకుందరావు గారంటే కొంచెం గౌరవం కూడా ఉంది.

ఇదంతా ఎందుకు చెప్పానంటే, సదరు ముకుందరావుగారు ఈ ఇవ్వడం వ్యవహారమంతా స్వయంగా కాకుండా మురళికి సన్నిహితుడైన ఇంకొకడి ద్వారా నడిపించడం, కేవలం ఆత్మగౌరవంవల్ల కాదని.

ఎలాగైతేనేం అయిదువందలూ మేజిస్ట్రేట్ గారికి అందాయి. కేసు వాయిదారోజు వచ్చేసింది, సాయంత్రం నాలుగైంది. ముకుందరావుగారు ఇంటికి వచ్చారు. వెనుక అప్పారావూ, ముత్యాలరావూ ఉన్నారు. వాళ్లు పుస్తకాలు పట్టుకున్నారు ఆయనవి.

ఇంట్లో అడుగు పెడుతూనే, "నేను చెప్పలేదుటోయ్? వాళ్ళ వకీలు ఈ పోయింటు పట్టుకుని ఓడిపోవుదామని చూశాడు. కాని...

నువ్వు చూశావుగా? ధణ తెగరగొట్టి చెప్పాను! అసలు మూడు సంవత్సరాల శిక్ష... నాలుగు నెలలుకి దిగింది. అందులో డబ్బు మహాత్యం లేకపోలేదనుకో." అయన నానాబాధా పడుతున్నాడు తన గొప్పతనం నిరూపించడానికి. వాళ్ళిద్దరూ ఏడవాలో నవ్వాలో ఎరగక ఆయన పాటకి తాళం వేస్తున్నారు చాలావరకు మూగగానే.

ఏది ఎలాగ ఉన్నా, అప్పారావు జైలుకి వెళ్ళాడు. నేను తరవాత ట్రాన్స్‌ఫర్ అయి ఈ ఊరు వచ్చేశాను.

కొంతకాలం తరవాత మురళిని కూడా ఇక్కడికి బదిలీ చేశారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మేమిద్దరమూ ఒకర్నొకరు గుర్తించుకుని మిత్రులమయ్యాము.

బాగా పరిచయమయ్యాక ఏదో మాటల సందర్భంలో మురళి అన్నాడు: "ప్లీడర్లు చాలా విచిత్రమైనవాళ్ళుంటారు. తన క్లయింటుకి శిక్ష తప్పించుకునేవాళ్ళూ ఉన్నారు. కావాలని శిక్ష వేయించేవాళ్ళూ ఉన్నారు."

"ఏమిటది?" అని అడిగాను కొంచెం ఆశ్చర్యంగా వినపడి.

"ఒకసారి ఒక కేసులో చాలా అన్యాయం చేశాన్లే. ఐదువందలు వస్తున్నాయని మేజిస్ట్రేటు చేత నాలుగు నెలల శిక్ష వేయించానో అమాయకుడికి."

ఈ మధ్య తగిలిన దెబ్బలవల్ల కాబోలు మురళికి కొంచెం మనసు మారింది.

"అసలు జరిగిన దేమిటంటే ఒక ప్లీడర్ గారు—రహస్యం ఎందుకు, ఆ ఊళ్ళో ఉండే ముకుందరావుగారి దగ్గరకి ఒక కేసు వచ్చింది. ఒక దోపిడీకి కారకుడని, ఒక అమాయకుడిని కోర్టులో నిలబెట్టారు. వాడు ఆయనని ప్లీడర్‌గా పెట్టుకున్నాడు. కేసంతా చక్కగా నడిపించాడాయన, అలవాటు ప్రకారం పాడు చెయ్యకుండా.

"కాని, ఇక రెండు రోజుల్లో జడ్జిమెంటు చెప్తారనగా, ముకుందరావుగారు ఒక మధ్యవర్తి ద్వారా అయిదువందల రూపాయలు పంపించి, ఆ ముద్దాయికి మూడు నెలలు శిక్ష వేయించమన్నారు.

మేజిస్ట్రేట్ చూస్తే ముద్దాయి నిర్దోషి అని నిశ్చయం చేసుకున్నాడు. కాని అయిదు వందలు వదులుకోలేక ముద్దాయికి నాలుగు నెలలు శిక్ష వేశాడు.

"ముకుందరావుగారి ఉద్దేశంమాత్రం నేటికీ బోధపడలేదు. ఎంత విచిత్రమో చూశావా?"

నా ఆశ్చర్యం వ్యక్తంచేస్తూ, ఆ ముద్దాయి పేరూ అవీ సరిచూశాను. అప్పారావే!

"ఇదంతా చాలా రహస్యం సుమా!" అన్నాడు మురళి మళ్ళా.

అసలు సంగతి చెప్దామని అనుకున్నాను. కాని, మురళి మనశ్శాంతి చెరపడం ఇష్టంలేక ఊరుకున్నాను.

నేటికి కూడా నేనీ రహస్యంతో బాధపడుతున్నాను. అప్పారావు విడుదల అయి తేలికపడ్డాడు. ముకుందరావుగారూ నాడే తేలికపడ్డారు. మురళి తన నేరం నాతో చెప్పుకుని తేలికపడ్డాడు. ఎటొచ్చీ, ఈ రహస్యభారంతో నేనే క్రుంగుతున్నాను లోకంకోసం.

---

ప్రజాజీవితం ఒకసారి పూర్తిగా కల్మషం అయిననాడు, యిక చట్టాల ద్వారా, శాసనాల ద్వారా- ఆస్తి హక్కులు, పౌరహక్కులు, స్వేచ్ఛ- వీటిని సంరక్షింప బూనడం వృథా ప్రయాస అవుతుంది. ఏదయినా ఫలవృక్షానికి చీడ పడితే, ఆ చీడపురుగుల్ని బహిష్కరిస్తూ నోటీసులు వ్రాసి చెట్టుకి అంటిస్తే ప్రయోజనం ఏముంటుంది?—హొరెస్ మాన్.

** ** ** **

శాసనాలన్నవి సాలెగూడుల వంటివి. నిరుపేదలూ, నిర్భాగ్యులూ అందులో యిరుక్కుని నశిస్తారు. ధనికులూ బలవంతులూ వాటిలోంచి దూరి బయటపడతారు—ఎనాకార్సిస్,